క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



మదనాపురం: మండలంలోని దుప్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు క్రీడల్లో ప్రతిభ కనబర్చారు. 10వ తరగతి చదువుతున్న అలియా బేగం కబడ్డీ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. లాలస 10వ తరగతి ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థాయిలో లాంగ్ జంప్‌లో ద్వితీయ బహుమతి సాధించింది. గురువారం ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ గుప్తా, ఉపాధ్యాయుల బృందం విద్యార్థులను పూలమాల, శాలువాతో అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ ఈశ్వరమ్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ సుధామణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన పీహెచ్‌సీ వైద్యులు

పాన్‌గల్: మండలంలోని అన్నారంతండా సమీపంలో గురువారం రోడ్డుపై స్పృహ తప్పి పడిపోయిన మోహన్‌నాయక్ అనే వ్యక్తికి అటుగా వెళ్తున్న పీహెచ్‌సీ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యులు మైథిలీ, తారశశాంక్ అత్యవసర చికిత్స అందించి 108 వాహనంలో జిల్లా ఏరియా ఆస్పత్రికి పంపించారు. అత్యవసర చికిత్స అందించి మానవత్వం చాటుకున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యులను గ్రామస్తులు అభినందించారు.

విరాళాల అందజేత



పెబ్బేరు రూరల్: పట్టణ సమీపంలో గల అయ్యప్ప ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ కోసం కర్నూల్‌కు చెందిన పుల్లయ్యశెట్టి కుమారులు మోహన్‌శెట్టి, రాఘవేంద్రశెట్టి, మోహన్‌శెట్టి తమ వంతుగా రూ.20,116, మల్లికార్జున్‌రెడ్డి రూ.10,116, దొడ్ల దయానంద్ 20 సిమెంట్ బస్తాలు, సత్యానందరెడ్డి రూ.5,116, శేర్‌పల్లికి చెందిన మహానంది యాదవ్ రూ.12వేలు విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో గురుస్వాములు వడ్డె ఈశ్వర్, కర్నాటి శ్రీనివాస్‌గౌడ్, జి.బాలవర్ధన్, కిషోర్ తదితరులు ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

కొత్తకోట రూరల్: మద్యం తాగి వాహనాలు నడపొద్దని కొత్తకోట ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి కొత్తకోట చౌరస్తాలో ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు బైక్‌లు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన పత్రాలను కలిగి ఉండాలని, వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పకుండా పెట్టుకోవాలన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లపై విచారణ

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల మధ్య తగాదాలు చోటుచేసుకోవడంతో గురువారం అధికారులు, కాంట్రాక్టర్ వెళ్లి పరిశీలించారు. గ్రామానికి చెందిన ఎస్సీలకు ఇళ్ల స్థలాల కోసం సుమారు 45 ఏళ్ల క్రితం ప్రభుత్వం సుమారు రెండు ఎకరాల భూమిని కేటాయించింది. ఈ భూమిలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 డబుల్‌బెడ్రూం ఇళ్లను చెత్తు లేవల్ వరకు నిర్మించారు. కాగా ఇటీవల కాంట్రాక్టర్ కాకుండా కొంతమంది లబ్ధిదారులు ఎవరికి నచ్చిన ఇంటిని వారు నిర్మాణాలు చేసేందుకు ఇటుక, ఇసుక తరలించడంతో పాటుగా గడపలు ఏర్పాటు చేసుకున్నారు. మిగతా లబ్ధిదారులు ఈ విషయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం పంచాయతీరాజ్ ఏఈ రమేష్‌నాయుడు, ఆర్‌ఐ తిరుపతయ్య, కాంట్రాక్టర్ బాలీశ్వర్‌రెడ్డిని తీసుకుని డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్దకు వచ్చారు. లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి వివరాలు సేకరించారు. ఇళ్లు ఉన్నవారికి మళ్లీ రెండు, మూడు ఇళ్లు ఇచ్చారని కొందరు అధికారుల ముందు వాపోయారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం పూర్తయి న వెంటనే లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

ఆత్మకూర్: వీపనగండ్లలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలకు కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రాజు, జిల్లా నాయకుడు బుచ్చన్న కోరారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీపీఎం ఆధ్వర్యంలో నిరంతరం ప్రజాసమస్యలపై పోరాటాలు చేస్తూ ప్రజలకు అండగా నిలబడుతున్నామన్నారు. రాష్ట్రం ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని లేని పక్షంలో లబ్ధిదారులతో కలిసి భారీ ఆందోళనకు సిద్ధమవుతున్నామన్నారు.

అద్దెకు ఆర్టీసీ బస్సులు

- పల్లె వెలుగు నుంచి సూపర్ లగ్జరీ వరకు అవకాశం
- కిలో మీటర్‌పై రూ.6 నుంచి రూ.11 వరకు తగ్గింపు
- నవంబర్ 1 నుంచి అమల్లోకి



వనపర్తిటౌన్: ఆర్టీసీ బస్సులను కిలో మీటర్ లెక్కన అద్దెకిచ్చేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. స్థానికులు దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తుండటంతో.. ప్రజలను ఆకట్టుకునేందుకు పల్లె వెలుగు నుంచి సూపర్ లగ్జరీ వరకు కిలో మీటర్‌పై గతంలో విధించే సర్వీస్ చార్జీలను తగ్గించారు. పల్లెవెలుగుపై రూ. 11, ఎక్స్‌ప్రెస్‌కు రూ.7, డీలక్స్‌కు రూ.8, సూపర్ లగ్జరీపై రూ. 6లను తగ్గించి ప్రజలకు చేరువ చేసేందుకు చర్యలు చేపట్టారు.

శబరిమలకు ఆఫర్

శబరిమలకు బయలుదేరే యాత్రికులకు అంతరాష్ట్ర బోర్డర్ రుసుం నుంచి మినహాయింపు ఇచ్చినట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇరు రాష్ట్రాల ఒప్పందంతో తెలంగాణ ఆర్టీసీలో ప్రయాణించే మాలధారులు, యాత్రికులకు బోర్డర్ ఫీజు భారం ఉండదు. అంతే కాకుండా కేవలం శబరిమలకు బస్సు బుక్ చేసిన గురుస్వామికి ఉచితంగా సీటు ఇవ్వడంతో పాటుగా ఇద్దరు వంటవాళ్లకు, ఇద్దరు కన్నె మాలధారులకు, లగేజీమెన్‌కు సీటు లేకుండా ఉచిత ప్రయాణం అందించనున్నారు.

6 గంటలు అదనం

గతంలో ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకుంటే నిర్ణీత గంటల వ్యవధి దాటగానే ప్రతి గంటకు రూ.300 చొప్పున అదనంగా రుసుము విధించేవారు. ప్రస్తుతం ఆ నిబంధనను ఎత్తివేయడంతో పాటుగా 6 గంటల అదనపు సమయాన్ని ప్రయాణికులకు అందించనున్నారు. ప్రతి బస్సు గంటకు 30కిలో మీటర్లు ప్రయాణించాలి. ఈ లెక్కన ఉదాహరణకు అద్దెకు తీసుకున్న బస్సు 2వేల కిలో మీటర్లకు 66 గంటలు ప్రయాణించాలి. ఈ క్రమంలో నిర్ణీత ప్రయాణ కిలోమీటర్ల గడువు కంటే అదనంగా 6 గంటలు ప్రయాణించే వెసులుబాటు కల్పించనున్నారు.

యాత్ర ఏదైనా..

తీర్థయాత్రలు, విహారయాత్రలు, శుభాకార్యాలకు ఇతరత్రా సామూహిక ప్రయాణాలు చేసుకునేందుకు పల్లె వెలుగుకు ప్రతి కిలోమీటర్‌కు రూ.57, ఎక్స్‌ప్రెస్‌కు రూ. 62, డీలక్స్ రూ.57, సూపర్ లగ్జరీకి రూ.59 చొప్పున లెక్కించి వసూళ్లు చేస్తున్నారు. ఇందుకు దరఖాస్తు చేసుకునేందుకు రూట్ పర్మిట్‌కు రూ.430, 5 శాతం జీఎస్టీ చెల్లించడంతో పాటుగా మొత్తం కిలో మీటర్లకు రానుపోను ప్రయాణానికి రూ.50 వేలు ఖర్చు అవుతుందనుకుంటే అందుకు 10 శాతం డబ్బును ముందే డిపోలో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. కిలోమీటర్ల లెక్కన ప్రయాణం పూర్తయిన తర్వాత ముందు చెల్లించిన డిపాజిట్ సొమ్మును తిరిగి ఇస్తారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థలు విహార యాత్రకు వెళ్లేందుకు నిర్ణయం తీసుకుంటే మొత్తం కిలో మీటర్లపై ఎంత అమౌంట్ అవుతుందో.. అందులో 10శాతం రాయితీ ఇవ్వనున్నారు. డీజిల్, డ్రైవర్లను ఆర్టీసీ సమకూర్చనున్నారు. అంతరాష్ట్రాలకు ప్రయాణించే సమయంలో ఆయా రాష్ట్రాల బోర్డర్ రుసుంను వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుంది.

బస్సులు	ప్రతి కిలోమీటర్‌కు ధర	
	గతంలో	ప్రస్తుతం
పల్లె వెలుగు	68	57
ఎక్స్‌ప్రెస్	69	62
డిలక్స్	65	57
సూపర్‌లగ్జరీ	65	59

సద్వినియోగం చేసుకోవాలి

ఆర్టీసీ బస్సుల అద్దె సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. వనపర్తి నుంచి ఏ రాష్ట్రానికైనా బస్సు సర్వీసులను అందిస్తాం. శబరిమల యాత్రలు ఆర్టీసీ బస్సులో ప్రయాణించడం ద్వారా రూ.18వేల నుంచి రూ.20వేల వరకు ఆదా అవుతాయి. బీఎస్ 6బస్సులను అందించడంతో పాటుగా సెల్‌ఫోన్ చార్జింగ్, వినోదానికి సినిమాలు చూసేందుకు అవకాశం ఉంటుంది. కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాలకు వెళ్లే ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



– వేణుగోపాల్, డీఎం, వనపర్తి డిపో

వనపర్తికి షటిల్ సర్వీసులు నడపండి

అమరచింత: మండల కేంద్రం నుంచి వనపర్తికి ఆర్టీసీ షటిల్ బస్సు సర్వీసులను నడపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి, అమరచింత మున్సిపల్ వైస్‌చైర్మన్ జీఎస్ గోపితో కలిసి డిపో మేనేజర్ వేణుగోపాల్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన తర్వాత ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు నడుస్తాయని ఆశించిన ప్రజలకు నేటికీ నిరాశే మిగిలిందన్నారు. అమరచింత మున్సిపల్, మండల కేంద్రంగా ఉన్నా జిల్లా కేంద్రానికి నేరుగా బస్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఆత్మకూర్ పట్టణానికి వచ్చి వనపర్తికి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. డిపో మేనేజర్ స్పందిస్తూ బస్ సౌకర్యం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

శ్రీరంగాపూర్: మండలంలోని తాటిపాములకు చెందిన బాలాజీ నవ్య, 2వ వార్డుకు చెందిన నర్సింహ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆస్పత్రి ఖర్చుల కోసం బాధితులు సీఎంఆర్‌ఎఫ్ కు దరఖాస్తు చేసుకున్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు దాడి యోగానందరెడ్డి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల మంజూరుకు కృషి చేశారు. బాలాజీ నవ్యకు రూ.15వేలు, నర్సింహకు రూ.13,500 మంజూరు కాగా చెక్కులను బాధితులకు అందజేశారు.

రూ.2లక్షల ఎల్వోసీ..

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన ఆటో వీరస్వామి ఇటీవల అనారోగ్యానికి గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. మెరుగైన వైద్యం కోసం మంత్రి జూపల్లి కృష్ణారావు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.2 లక్షల ఎల్వోసీని మంజూరు చేయించారు. మంత్రి కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎల్వోసీని అందజేశారు.

రోడ్లపై ధాన్యం ఆరబెట్టొద్దు

గోపాల్‌పేట: రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాలు బారిన పడే అవకాశం ఉందని, కల్లాలు, పంట పొలాల్లోనే ఆరబెట్టాలని ఎస్‌ఐ నరేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధాన్యం రాశులు పోసి వాటిపై నల్ల కవర్లు కప్పి, వాటి చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల వాహనదారులు వాటి గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. చాలామంది క్షతగాత్రులుగా మారడంతో పాటు కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టూరిజం భవన మరమ్మతుకు నిధులు మంజూరు



టూరిజం భవనాన్ని పరిశీలిస్తున్న రాజేంద్రప్రసాద్, అధికారులు

శ్రీరంగాపూర్: శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని టూరిజం భవనం కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉండటంతో మాజీ జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి టూరిజానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు రూ.50లక్షల నిధులు మంజూరు చేయించారు. గురువారం రాజేంద్రప్రసాద్ టూరిజం శాఖ అధికారులతో కలిసి భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా టూరిజం భవనం నిరుపయోగంగా మారిందన్నారు. టూరిజం భవనం పూర్వవైభవం తీసుకొచ్చేందుకు నిధులు మంజూరు చేసిన మంత్రికి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడికి రాజేంద్రప్రసాద్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లస్వామి, గోవింద్, రాంచందర్, రాములు, రాజు ఉన్నారు.

ఆదాయం లేదు.. వేతనాలకు ఆగాల్సిందే!



కార్మికులకు పుర పరిస్థితిని వివరిస్తున్న కమిషనర్

వనపర్తిటౌన్: మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ నిధులు ఏ మాత్రం లేవని, కార్మికులు ఈ నెల 25 వరకు వేతనాల కోసం ఆగాల్సిందేననీ మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ తెలిపారు. ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు ఇవ్వడం లేదని, వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం పురపారిశుద్ధ్య కార్మికులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట అంజనేయులు కమిషనర్ పూర్ణచందర్‌ను కలిశారు. ఈ మేరకు స్పందించిన కమిషనర్ ఆస్తి పన్ను వసూళ్లు కావడం లేదని, అధికారులకు ఎల్‌ఆర్‌ఎస్, ఇంటింటి సర్వేలో బీజీగా ఉన్నారని చెప్పారు. కార్మికులకు వేతనాలు ఇచ్చేందుకు రూ. 50 లక్షలు అవసరం అవుతాయన్నాయన్నారు. గతంలో పట్టణ ప్రగతి నిధులు ప్రభుత్వం నుంచి రావడంతో ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు వేసేవాళ్లమన్నారు.

ఆదాయ మార్గాలపై దృష్టి

కార్మికులకు వేతనాలు ఇవ్వడమే మా ప్రథమ కర్తవ్యం. ఇందుకోసం ఆస్తి పన్నుతో పాటుగా బహుళ భవనాల నుంచి ట్రేడ్ లైసెన్స్ రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించాం. దీనికి తోడు నల్లా బిల్లుల వసూళ్లలోనూ వేగం పెంచాం. ఆదాయం రాగానే కార్మికులకు వేతనాలు ఇస్తాం.

– పూర్ణచందర్, కమిషనర్

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు

వనపర్తి రూరల్: కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగుండా చూడాలని వనపర్తి మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ అధికారులకు సూచించారు. మండలంలోని కిష్టగిరి, సవాయిగుడెం, పెద్దగూడెం, చిమనగుంటపల్లి గ్రామాల్లో గ్రామ మహిళా సంఘం (ఐకేపీ) ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన మార్కెట్ డైరెక్టర్లతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సురేష్, శారదమ్మ, డీఆర్‌డీఏ డీపీఎల్ అరుణమ్మ, ఏపీఎం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు చేయాలని ఏఓ వినయ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు తేమ శాతం ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

అమరచింత: రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధరతో పాటు సన్నాలకు అదనంగా రూ.500 బోనస్ పొందాలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఎం శ్రీనివాసులు కోరారు. మండలంలోని నాగల్‌కడ్మూర్, చంద్రగఢ్, నందిమళ్ల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ తిరుపతమ్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నందిమళ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా ఉండేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మల్లయ్య తెలిపారు. గురువారం మండలంలోని ఆగారం, అల్లమాయపల్లి, అప్పారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో సింగల్‌విండో వైస్ చైర్మన్ క్యామరాజు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పెబ్బేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గౌని ప్రమోదిని అన్నారు. గురువారం పెబ్బేరు మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రం, మండలంలోని కంచిరావుపల్లి, గుమ్మడం, గుమ్మడంతండా, పాతపల్లి, చెలిమిళ్ల, రాంపురం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మెన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, మాజీ డైరెక్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో అజ్జకొల్లులో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను మార్కెట్ చెర్మెన్ పల్లెపాగ ప్రశాంత్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, వెంకట్‌నారాయణ, వడ్డె కృష్ణ, శ్రీనివాస్‌యాదవ్, కృష్ణవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ బ్రహ్మమ్మ, వంగూరు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురం మండలం ఆగారంలో..



కిష్టగిరిలో..

పకడ్బందీగా సమగ్ర కుటుంబ సర్వే



తిర్మలాయపల్లిలో ఇంటింటి సర్వే చేస్తున్న సిబ్బంది



గోపాల్‌పేటలో సర్వేపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యుమరేటర్లు పూర్తి వివరాలను నమోదు చేయాలని తహసీల్దార్ చాంద్‌పాష, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే నమోదు ప్రక్రియను అధికారులు పరిశీలించారు.

అమరచింత: మండల వ్యాప్తంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి సర్వేకు సంబంధించిన స్టిక్కర్‌ను ఇంటి తలుపులకు, ఇంటి ముందున్న గోడలకు అతికిస్తున్నారు. తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం తమ బ్లాక్‌ల పరిధిలో సర్వేను పర్యవేక్షిస్తున్నారు.

పాన్‌గల్: సర్వేలో కుటుంబ వివరాలు సేకరించిన ప్రతి ఇంటికి స్టిక్కర్ వేయాలని ఎంపీడీఓ గోవింద్‌రావు, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి ఎన్యుమరేటర్లకు సూచించారు. గురువారం మండల కేంద్రంతో పాటు గోప్లాపూర్, రేమద్దుల గ్రామాల్లో కుటుంబ వివరాల సేకరణ, స్టిక్కర్ వేసే ప్రక్రియను వారు పరిశీలించి ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. మండలంలోని రాయినిపల్లిలో సర్వేను డీటీ అశోక్‌నాయుడు పరిశీలించారు.

గోపాల్‌పేట: మండలం కేంద్రంలోని బస్టాండులో కళాకారుల ద్వారా సమగ్ర ఇంటింటి సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజు, కళాకారులు గుడిసె శివలింగం, సువర్ణ, రాధ, శ్రీనివాసులు, నరసింహ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని త్మిలాయపల్లిలో నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ సుగుణ, డిప్యూటీ తహసీల్దార్ పరమేశ్వర్ పరిశీలించారు.

ఎస్సీల నమోదులో జాగ్రత్తలు తీసుకోవాలి

అమరచింత: సమగ్ర సర్వేలో భాగంగా మాదాసి కురువలు కులగణనలో అధికారులను తప్పుదోవ పట్టించి ఎస్సీలుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని, నిజమైన ఎస్సీలకు న్యాయం చేయాలంటూ తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులుకు గురువారం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువకులు వినతిపత్రాలు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో బీసీ బీ గ్రూప్‌లో గల కురుబ, కురుమ కులాలకు చెందిన వారు దొడ్డిదారిన సర్వే పత్రాలలో ఎస్సీలమంటూ నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో విజయ్, సూరి, రమేష్, సురేందర్, కార్తీక్, అజయ్, వినయ్, భాను, పవన్ పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

పాన్‌గల్: జన విజ్ఞాన వేదిక, సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయంలో పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి రవికుమార్ తెలిపారు. 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ టెస్ట్‌లో పాల్గొన్నారన్నారు.

గోపాల్‌పేట: ప్రతి విద్యార్థి సైన్స్‌పై మక్కువ పెంచుకొని ఉన్నతంగా రాణించాలని హెచ్‌ఎం రమాకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్ పరీక్షలు నిర్వహించారు. అంతకుముందు చెకుముకి టాలెంట్ టెస్టుకు సంబంధించిన వాల్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో రాందేవ్ రెడ్డి, యాదగిరి, అర్జున్, శోభ, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: విద్యార్థులు పోటీ పరీక్షల్లో తరుచూ పాల్గొనడం వల్ల విద్యలో ఉత్తమంగా రాణించే అవకాశం ఉందని జీహెచ్‌ఎంలు భానుప్రకాశ్, నర్సింహ, రాజవర్ధనాచారీ అన్నారు. గురువారం మండలంలోని పాఠశాలల్లో సీవీ రామన్ జయంతిని పురస్కరించుకొని చెకుముకి టాలెంట్ టెస్టును నిర్వహించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, కల్వరాల ఉన్నత పాఠశాలతో పాటు పలు గ్రామాల్లోని పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజులాదేవీ, శ్రీనివాసులు, ఆనంద్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, బలరాం, జితేందర్, సీఆర్పీ వెంకటేష్ పాల్గొన్నారు.



గోపాల్‌పేటలో ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

సంత స్థలం పరిరక్షణకు కార్యాచరణ



మాట్లాడుతున్న సంత పరిరక్షణ కమిటీ సభ్యులు

పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని సంత స్థలాన్ని రక్షించుకునేందుకు ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్తున్నామని స్థల పరిరక్షణ సమితి అధ్యక్షుడు బాలస్వామి అన్నారు. ఎన్నో ఏళ్లుగా సంత స్థలం వివాదం కొనసాగుతుంది. పట్టాదారులైన పూజారులకు అనుకూలంగా ఇటీవల హైకోర్టు తీర్పు ఇవ్వడంతో పట్టణవాసులు పార్టీలకు అతీతంగా సంత స్థలాన్ని కాపాడుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసినట్లు వేణుగోపాలస్వామి భూమి పరిరక్షణ సమితి సభ్యులు తెలిపారు. ఈనెల 9 నుంచి సుభాష్‌చౌరస్తాలో పెబ్బేరు, మండల ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపడతామన్నారు. అనంతరం సంత స్థలానికి సంబంధించిన సర్వే నంబర్ల రిజిస్ట్రేషన్లను నిలిపివేసేందుకు తహసీల్దార్, ఆర్డీవోలతో పాటు హైదరాబాద్‌లో జరిగే ప్రజా దర్బార్‌కు వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రాలను ఇస్తామన్నారు. పట్టణంలో వంటావార్పు, నిరసన ర్యాలీలు, బంద్ వంటి కార్యక్రమాలను చేపడుతామని స్పష్టం చేశారు. దీంతో పాటు పెబ్బేరు నుంచి వనపర్తి వరకు పాదయాత్ర చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దయాకర్ రెడ్డి, సహదేవుడు, సంతోష్, ఎల్లస్వామి, వర్తకవ్యాపారులు, పట్టణ వాసులు, సంత కాంట్రాక్టర్లు తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

వనపర్తి రూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని టీయూసీఐ జిల్లా కోశాధికారి రాజు అన్నారు. ఈ మేరకు ఆయన కార్మికులతో కలిసి గురువారం కలెక్టరేట్‌లో డీపీఓ సురేష్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు 3 నెలల నుంచి వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గణేష్, గోవిందమ్మ, మజీద్, అభిశాలి తదితరులు పాల్గొన్నారు.